మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 72 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada

సోమవారం 03 జూన్ 2024




## ట్యాంక్ బండ్‌పై జయజయహో తెలంగాణ

**అంబరాన్నంటిన సంబురాలు - తెలంగాణ చరిత్రను కండ్లకుకట్టిన కళారూపాలు**

**రాష్ట్ర గీతానికి 5 వేల మంది ట్రైనీ పోలీసులతో ఫ్లాగ్ వాక్**

హైదరాబాద్, (ప్రజా మంటలు): రాష్ట్రావిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన సంబురాలు అంబరాన్నంటాయి. ట్యాంక్‌బండ్‌పై 'పదేళ్ల పండుగ' పేరుతో రాష్ట్ర చరిత్ర, వైభవాన్ని చాటేలా ప్రత్యేక

మిగతా 2లో..



## 100 రోజుల యాక్షన్ ప్లాన్

**అధికారులతో ప్రధాని మోడీ సమీక్ష**



న్యూఢిల్లీ,జూన్ 2 (ప్రజా మంటలు): కేంద్రంలో మూడోసారి అధికారం భాజపాదేనంటూ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెలువడడంతో కమలం పార్టీలో నూతనోత్సాహం కనిపిస్తోంది. ముందే చెప్పిన విధంగా వందరోజుల భవిష్యత్ ప్రణాళికపై ప్రధాని మోడీ దృష్టి సారించారు. అధికారం చేపట్టగానే చేసే ప్రాధాన్యతాంశాలపై ఉన్నతస్థాయిలో చర్చిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే కన్యాకుమారిలో దాదాపు 45గంటల పాటు ధ్యానం ముగించుకున్న ప్రధాని మోదీ.. వివిధ అంశాలపై సమీక్షలతో ఆదివారం షెడ్యూల్ బిజీ బిజీగా కొనసాగుతోంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేశాక అమలు చేయాల్సిన 'తొలి 100 రోజుల' ప్రణాళికపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. రెమాల్ తుపాను కారణంగా ఈశాన్య రాష్ట్రాల్లో వరదల ప్రభావంపై ఉన్నతాధికారులతో ప్రధాని మోదీ తొలుత రివ్యూ నిర్వహించనున్నారు. అనంతరం దేశవ్యాప్తంగా కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల వల్ల అనేక రాష్ట్రాల్లో చోటు చేసుకుంటున్న మరణాలు, బాధిత కుటుంబాలకు సాయంపై సమీక్ష చేయనున్నారు. వీటితోపాటు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమాలపైనా ఉన్నతాధికారులతో చర్చించనున్నారు. మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత.. మొదటి 100 రోజుల కార్యాచరణపైనా ఉన్నతాధికారులతో ప్రధాని మోదీ మేధోమథనం జరపనున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని ఎన్నికలకు ముందే కేంద్ర మంత్రులకు సూచించారు. వంద రోజుల్లో అమలు చేయాల్సిన కార్యక్రమాల ప్రాధాన్యతా క్రమాన్ని రూపొందించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే.

# 3 జోన్లుగా తెలంగాణ

**అభివృద్ధి కోసం 3 జోన్లుగా రాష్ట్రం**
**సమగ్రాభివృద్ధి సాధిస్తాం..**
**ఆత్మగౌరవం కోసమే తెలంగాణ..**
**బానిసత్వం కోసం కాదు**
**మెగా డీఎస్సీ, ఉద్యోగ కల్పన**
**సాకారం చేసేదిశగా పాలన**
**అన్నదాతల కష్టాలను తీర్చేవిధంగా**
**సర్కారు నిర్ణయాలు**
**పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించి**
**ప్రసంగించిన సిఎం రేవంత్ రెడ్డి**
**అందెశ్రీ జయజయహే తెలంగాణ**
**రాష్ట్ర గీతంగా ఆవిష్కరణ**

హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ జీవనశైలి స్వేచ్ఛ అని.. ఇక్కడి ప్రజలు బానిసత్వాన్ని భరించరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రేమను పంచడం, పెత్తనాన్ని ప్రశ్నించడం రాష్ట్ర ప్రజల తత్వమని చెప్పారు. సంక్షేమం ముసుగులో చెరబట్టాలని చూస్తే ఇక్కడి సమాజం సహించదన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఆయన మాట్లాడారు. జాతీయ జెండా ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ..కాంగ్రెస్ పాలనలో పాలకులు, పాలితుల మధ్య ఉన్న అడ్డుగోడలు బద్దలు కొట్టామని వివరించారు. ఇందిరా పార్కులో ధర్నాలకు అనుమతినిచ్చినట్లు చెప్పారు. ప్రతిపక్షానికి గౌరవం ఇచ్చామన్నారు. తెలంగాణ అస్థిత్వానికి, ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరిగి పదేళ్లు అవుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరులకు నివాళులు అర్పించారు. ఆరు దశాబ్దాల కలను నెరవేర్చిన ఆ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.బానిసత్వాన్ని తెలంగాణ భరించదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ యువత కోరుకున్నట్టుగా టీఎస్ స్థానంలో టీజీ ఏర్పాటు చేశామని వివరించారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టే సమయానికి రాష్ట్రం 7 లక్షల కోట్ల అప్పుల్లో



ఉందని రేవంత్ గుర్తుచేశారు. రాష్ట సంపద పెంచడం, ఆర్థిక పునరుజ్జీవనం సాధించడం కోసం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కంకణబద్దులై పనిచేస్తున్నామని వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజిస్తున్నామని

మిగతా 2లో..



## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మతిభ్రమించింది: హరీష్ రావు సవాల్



హైదరాబాద్, జూన్ 2 (ప్రజా మంటలు): మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తనపై చేసిన ఆరోపణలపై మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఘాటుగా స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితునిగా భావిస్తున్న మాజీ ఐఏఎస్ ప్రభాకర్ రావును అమెరికాలో హరీశ్ రావు రహస్యంగా కలిశారంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన ఆరోపణలను హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మతిభ్రమించిందని.. ఆయన డాక్టరుకు చూపించుకోవడం మంచిదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు అబద్దాలతో ప్రభుత్వాలు నడుపుతున్నారని చెప్పడానికి ఆ ఆరోపణ ఒక ఉదాహరణ అని హరీశ్ రావు చెప్పుకొచ్చారు. తాను తన కుటుంబ సభ్యులతో కలిసి విదేశాలకు వెళ్లింది వాస్తవమని హరీశ్ రావు తెలిపారు. అయితే తాను అమెరికా వెళ్లినట్టుగా.. ప్రభాకర్ రావును కలిసినట్టుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడారన్నారు. ఒకవేళ తాను అమెరికా వెళ్లి.. ప్రభాకర్ రావుని కలిసినట్లు రుజువు చేస్తే అమరవీరుల స్తూపం ముందు ముక్కు నేలకు రాయడానికి తాను సిద్ధమని.. రుజువు చేయకపోతే వెంకట్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పి అమరవీరుల స్తూపం ముందు ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణకు రాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు





న్యూఢిల్లీ,జూన్ 2 (ప్రజా మంటలు): గొప్ప వారసత్వం, భిన్న సంస్కృతులు తెలంగాణలో కనిపిస్తాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఆమె ఎక్స్(ట్విటర్) వేదికగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఐటీ సేవల్లో రాష్ట్రం గుర్తింపు పొందిందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలు మరింత అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశాభివృద్ధికి తెలంగాణ అందించిన సహకారం ప్రతి భారతీయుడికి గర్వకారణ మని తెలిపారు. గొప్ప చరిత్ర, విశిష్ట సంస్కృతి ఈ రాష్ట్ర ప్రత్యేకతలని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నట్లు నరేంద్ర మోదీ తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విటర్) వేదికగా పోస్టు చేశారు. తెలంగాణ ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు.. దేశాభివృద్ధికి అందించిన సహకారం మరువ లేనిది.. గొప్ప చరిత్ర, విశిష్ట సంస్కృతి తెలం గాణ ప్రత్యేకతలు.. తెలంగాణ అభివృద్ధికి మేము కట్టుబడి ఉన్నాం.. అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తెలంగాణ సోదర సోదరీమణులకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు. తెలంగాణ రాష్ట్రం, దేశాభివృద్ధికి అందించిన సహకారం ప్రతి భారతీయునికి గర్వకారణం . గొప్ప చరిత్ర, విశిష్టమైన సంస్కృతి ఈ రాష్ట్ర ప్రత్యేకతలు. రానున్న రోజుల్లో ఈ రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేసేందుకు మేము కట్టుబడి ఉన్నాం..'నరేంద్ర మోదీ..

## కేసీఆర్‌కు కటకటాలు

**ప్రభాకర్‌రావును కలిసేందుకే హరీశ్ రావు అమెరికా..**


**మంత్రి కోమటిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు**



హైదరాబాద్, జూన్ 2 (ప్రజా మంటలు): మాజీ సీఎం కేసీఆర్‌కు కటకటాలు తప్పవని, లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు తర్వాత భారాసలో ఎవరూ ఉండరని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస అధినేత కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలపై ఏమాత్రం ప్రేమ లేదన్నారు. మంత్రి పదవి రాలేదనే కారణంతోనే అప్పట్లో తెలంగాణ ఉద్యమం చేపట్టారని, అమాయకులను రెచ్చగొట్టారని విమర్శించారు. ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో భోజనం చేయాలంటే రూ.లక్ష వసూలు చేసేవారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజలంతా సోనియాగాంధీకి రుణపడి ఉండాలని చెప్పిన కేసీఆర్.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి ఆమె కాళ్లు మొక్కారని గుర్తు చేశారు.

మిగతా 2లో..

## ప్రజా నాడి




## స్థానిక ఎమ్మెల్సీలో బిఆర్ఎస్ విజయం

**కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డినూ నవీన్ కుమార్ గెలుపు**



మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 2 (ప్రజా మంటలు): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో భారాస విజయం సాధించింది. కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిపై భారాస అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి 109 ఓట్ల తేడాతో గెలుపొందినట్లు సమాచారం. మార్చి 28న పోలింగ్ నిర్వహించగా.. ఆదివారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఉదయం 8 గంటల నుంచి మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహించారు. ఈ ఎమ్మెల్సీ స్థానం పరిధిలో మొత్తం 1,439 మంది ఓటర్లు ఉండగా.. 1,437 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. కౌంటింగ్ కోసం మొత్తం ఐదు టేబుళ్లు ఏర్పాటు చేశారు. 1437 ఓట్లలో 21 చెల్లనివిగా గుర్తించారు. మిగిలిన 1416 ఓట్లలో నవీన్‌కుమార్‌రెడ్డికి 762, మన్నె జీవన్‌రెడ్డికి 653, స్వతంత్ర అభ్యర్థికి ఒక్క ఓటు వచ్చాయి. భారాస అభ్యర్థి విజయాన్ని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి శాసనసభ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

## అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకోసం పనిచేస్తాం

**బస్సు యాత్రతో ప్రజల్లో మళ్లీ కదలిక వచ్చింది**

**ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే 105 సీట్లు వస్తాయి**

**ప్రొఫెసర్ జయశంకర్ సార్ లాంటి వారి వల్లనే తెలంగాణ ఉద్యమం**

**తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్**



హైదరాబాద్, (ప్రజా మంటలు): ఎన్నికల్లో గెలుపోటములు సహజమని.. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పని చేయాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# 3 జోన్లుగా తెలంగాణ

సీఎం రేవంత్ స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచి ఔటర్ రింగ్ రోడ్ వరకు అర్బన్ తెలంగాణగా ఉంటుందని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్ నుంచి రీజనల్ రింగ్ రోడ్ వరకు సబర్బన్ తెలంగాణ అని.. రీజనల్ రింగ్ రోడ్ నుంచి తెలంగాణ సరిహద్దు వరకు గల ప్రాంతాన్ని గ్రామీణ తెలంగాణగా పరిగణిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అంతకుముందు జాతీయ పతాకాన్ని సీఎం ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'ను సీఎం రేవంత్ విడుదల చేశారు. తెలంగాణ డ్రీమ్- 2050 మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ వచ్చి పదేళ్లయినా రాష్ట్ర గీతం లేదు. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గీతంగా ఉండాలని అనుకున్నాం. ఇప్పుడు రాష్ట్ర గీతంగా అధికారికంగా ప్రకటిస్తున్నాం. జాతి చరిత్రకు అద్దంపట్టేదే రాష్ట్ర చిహ్నం. జాతి చరిత్ర మొత్తం నిక్షిప్తమై ఉండేది అందులోనే. సూచనలకు అనుగుణంగా నూతన చిహ్నాన్ని రూపొందిస్తున్నాం. ప్రజల ఆకాంక్షల మేరకు టీఎస్‌ను.. టీజీగా మార్చాం. సగటు గ్రామీణ మహిళా రూపమే తెలంగాణ తల్లి రూపంగా ఉండాలని రేవంత్ అన్నారు. తెలంగాణను 3 జోన్లుగా విభజన చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న ప్రాంతం అర్బన్ తెలంగాణ, ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు ప్రాంతం వరకు సబ్ అర్బన్ తెలంగాణ, రీజినల్ రింగ్ రోడ్డు నుంచి తెలంగాణ సరిహద్దు వరకు గ్రామీణ తెలంగాణగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. మూడు ప్రాంతాలకూ త్వరలో అభివృద్ధి ప్రణాళికలు ప్రకటిస్తామని తెలిపారు. త్వరితగతిన రీజినల్ రింగు రోడ్డు పూర్తిచేస్తామన్నారు. తాలు, తరుగు లేకుండా ధాన్యం కొంటున్నాం. తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొంటున్నాం. రైతుల ఖాతాల్లో రూ.7,500 కోట్లు జమ చేశాం. మూసీ సుందరీకరణ కార్యక్రమాన్ని చేపడతాం. దీనికోసం రూ.వెయ్యి కోట్లు కేటాయించాం. ప్రజల అవసరాలకు తగినట్లు మెట్రో విస్తరణ జరుగుతుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ నీరు ఇచ్చే ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యత ఇస్తాం. డ్రగ్స్, గంజాయిని ఉక్కుపాదంతో అణచివేస్తాం అని వివరించారు. ఈ అంశంలో ఎంతటి వారున్నా వదిలిపెట్టం. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ పరిధి రూ.10లక్షలకు పెంపును అమలు చేశాం. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. 30వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. 11,062 పోస్టులతో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చాం. ఈ ఏడాది 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి రూ.22,500కోట్లు కేటాయించాం. మండల కేంద్రాల్లో అంతర్జాతీయ మోడల్ స్కూళ్ల నిర్మాణం మా బాధ్యత. స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, రాజకీయ పార్టీల నేతలు. సిఎస్ శాంతి కుమారి, డిజిపి రవిగుప్తా తదితరులు పాల్గొన్నారు.

అమరులకు సిఎం రేవంత్, మంత్రుల నివాళి

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా తొలుత సీఎం రేవంత్‌రెడ్డి గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద అమరులకు ఘనంగా నివాళి అర్పించారు. పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతోపాటు మంత్రులు, ఇతరులు కూడా పుష్పాంజలి ఘటించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన వారి సేవలను గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, సీతక్క, తుమ్మల, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అమర వీరుల స్తూపానికి నివాళి అర్పించారు. అమరుల స్థూపాన్ని సర్వాంగ సుందరంగా పూలతో అలంకరించారు. మరోవైపు వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరణ, ఇతర కార్యక్రమాల్లో సిఎం పాల్గొన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఉత్సవాలను వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కళాబృందాలతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేసారు.

## అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకోసం పనిచేస్తాం

నిర్వహించిన రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మనకు మనమే కాదని.. ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు చెప్పుకోవాలని అన్నారు. కొన్ని క్షణాలు చాలా గొప్పగా ఉంటాయన.. కొన్ని క్షణాలు బాధగా ఉంటాయని చెప్పారు. అవి ఊహించుకుంటే ఇప్పుడు కూడా దుఃఖం వచ్చేలా ఉందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆజన్మ తెలంగాణ వాది అని.. ఈ సమయంలో ఆయన్ను స్మరించుకోకుండా ఉండలేమని అన్నారు. 25 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం ఈ గులాబీ జెండాది అని కేసీఆర్ అన్నారు. 'బీఆర్ఎస్ మహావృక్షం. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాక కొంత నైరాశ్యంలో ఉన్నాం. ఆ తర్వాత నేను బస్సు యాత్ర మొదలు పెట్టగానే మళ్లీ అదే గర్జన కనిపించింది. మోకాళ్ల ఎత్తు కూడా లేనోళ్లు ఏదేదో మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ఖతం అయితది అంటున్నారు. వందకు వంద శాతం మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది. రైతు బంధు ఊరికనే ఇవ్వలేదు. స్థిరీకరణ కోసం ఇచ్చాం. చేప పిల్లలు, గొర్రెలు ఇస్తుంటే కూడా అవమానించారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేశాం. ఎన్ని చేసినా కొంత విష గాలి వస్తుంది. ఆ గాలికి జనం కొంత అటు వైపు మొగ్గుచూపారు. గులాబీ జెండా పుట్టిందే తెలంగాణ రక్షణ కోసం. ప్రజలు ఏ పాత్ర ఇస్తే ఆ పాత్రలో పని చేయాలి. కరెంట్ విషయంలో ప్రభుత్వం తీరు బాధాకరం. రైతులకు విత్తనాలు గత పదేళ్లలో సక్రమంగా ఇచ్చాం. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో లైన్లో నిల్చోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ కు 105 అసెంబ్లీ సీట్లు వస్తాయ్. మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ గెలిచాం. నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్ రెడ్డి విజయం ఖరారైంది. లోక్ సభ ఎన్నికల్లో ఎన్ని సీట్లు వచ్చినా ఇబ్బంది లేదు. నూతన ఉద్యమ పంథా అవివాహకరించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రజల పరిరక్షణెళి ధ్యేయంగా పనిచేద్దాం.' అని కేసీఆర్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. '1999లో అంతకు ముందు కాలంలో తెలంగాణ అనుభవించిన బాధ ఊహించుకుంటే ఇప్పుడు దుఃఖం వచ్చే పరిస్థితి ఉంది. యావత్ తెలంగాణ కరువులు, వలసలు, కరెంట్ కోతలు, ఆత్మహత్యలు, చేనేత కార్మికుల ఆకలి చావులకు నెలవుగా ఉండేది. సరైన వ్యూహం లేకపోవడం వల్లే 1969 ఉద్యమం విఫలమైంది. 2001లో కాదు. 1999లోనే తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. ఉద్యమ రూపాలు గుర్తు చేసుకుంటే ఇప్పటికీ ఒళ్లు పులకరిస్తుంది.' అని కెసిఆర్ పేర్కొన్నారు. మన భాష మాట్లాడుతుంటే నవ్వుతారో ఏమో అనుకునే స్థాయి ఆనాడు ఉండేదని కేసీఆర్ అన్నారు. గతంలో తెలంగాణ అనే పదాన్ని పలకవద్దని అప్పటి స్పీకర్ అసెంబ్లీలో అన్నారని.. ఇక్కడి భాష స్వచ్ఛమైన తెలుగు కాదని కొందర హేళన చేశారని గుర్తు చేశారు. 'వలసలు పోతుంటే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు కనీసం ఆపలేదు. స్ట్రీట్ ఫైట్ కాదు స్టేట్స్ ÷ట్ అయితే చేస్తా అని వచ్చా. మళ్లీ ఉద్యమం నేను మొదలుపెట్టాను. అనేక పోరాటాల తర్వాత ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాం. పాతాళంలో ఉన్న తెలంగాణను పైకి తీసుకొచ్చాం. పాటతోనే మొత్తం తెలంగాణ చరిత్ర తెలిసేది. చరణంలోనే మొత్తం తెలవాలి. అందుకే తెలంగాణ పాటతో పుట్టింది.' అని అన్నారు. తెలంగాణ జాతిపిత జయశంకర్ సార్‌ను ఆజన్మ తెలంగాణవాదిగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీర్తించారు. జయశంకర్ సార్ తెలంగాణ గురించి చేసిన పోరాటాలను గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. ఆ రోజుల్లో తెలంగాణ గురించి మాట్లాడుడే కష్టంగా ఉండెనని, నాటి శాసనసభ స్పీకర్ యనమల రామకృష్ణుడు తెలంగాణ అనే పదం ఉపయోగించవద్దని చెప్పారని, వెనుకబడిన ప్రాంతం అనాలని శాసనసభముఖంగా వ్యాఖ్యానించారని కేసీఆర్ గుర్తుచేశారు.

## కేసీఆర్‌కు కటకటాలు

'అధికారంలోకి వచ్చాక కేసీఆర్.. చేపలు, గొర్రెల పంపిణీ పేరిట రూ.వేల కోట్లు తిన్నారు. ప్రపంచంలో వింత అని చెప్పిన మేడిగడ్డ మూడేళ్లలో కూలిపోయింది. మేడిగడ్డకు మరమ్మతులు చేసినా గ్యారంటీలేదని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చింది. భారాస చేసిన రైతు రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది. వందల ఎకరాలు ఉన్నవారికి కూడా రైతుబంధు వేశారు. 70 వేల మంది టీచర్లు రిటైర్ అయినా డీఎస్సీ నిర్వహించలేదు' అని కోమటిరెడ్డి విమర్శించారు. కానీ తాము అలా కాకుండా పంద్రాగస్టుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయబోతున్నామని పునరుద్ఘాటించారు. ఇకపోతే ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిబయటపెట్టారు. ఈ కేసు విషయంలో అన్ని విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుండటంతో మాజీ మంత్రి హరీష్‌రావు దొంగచాటుగా గత సీఎండీ ప్రభాకర్ రావును అమెరికా వెళ్లి కలిసి వచ్చారని ఆరోపించారు. మే 26న ఎమిరేట్స్ విమానంలో హరీష్‌రావును కేసీఆర్ అమెరికా పంపారని విమర్శించారు. గత సీఎండీ ప్రభాకర్‌కి ఎప్పుడు ఫోన్ చేసినా హాస్పిటల్లో ఉన్నానని చెప్పేవాడన్నారు. అసెంబ్లీకి వచ్చే మొహం కేసీఆర్‌కి లేదన్నారు. అమెరికా వెళ్లి ప్రభాకర్ రావును కలవలేదని ప్రమాణం చేయడానికి హరీష్ సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎవరికి చెప్పకుండా అమెరికా వెళ్లాల్సిన అవసరం హరీష్‌రావుకి ఏమొచ్చిందని నిలదీశారు. ఎన్ని రోజులైనా కేసీఆర్‌ని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ప్రభాకర్ రావును వెంటనే వచ్చి పోలీసులకు లొంగిపోవాలని కేసీఆర్ చెప్పాలన్నారు. కేసీఆర్ కూడా తన తప్పు ఒప్పుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన ప్రభాకర్ రావును కలవడానికే హరీష్ అమెరికా వెళ్లారని ఆరోపణలు చేశారు. మంత్రి కోమటిరెడ్డి నివాసంలో ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.... ప్రభాకర్ రావు ఇండియాకు రాకుండా ఆపేందుకే హరీష్ అమెరికా వెళ్లారన్నారు. ట్యాపింగ్ చేస్తూ భార్యాభర్తల ఫోన్లు కూడా విన్నారని... ప్రభాకర్ రావు అప్రూవర్‌గా మారితే ఇబ్బంది అవుతుందని కేసీఆర్ భయపడు తున్నారన్నారు.

## ట్యాంక్ బండ్‌పై జయజయహో తెలంగాణ



కార్యక్రమాలను నిర్వహించింది. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ రాధాకృష్ణన్‌తో కలిసి అక్కడ స్టాళ్లను పరిశీలించారు. అనంతరం సభాస్థలికి గవర్నర్‌ను సీఎం ఆహ్వానించగా, ముఖ్యమంత్రికి సీఎస్ శాంతి కుమారి ఆహ్వానం పలికారు. గవర్నర్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేపట్టారు.

భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చరిత్రను, వైభవాన్ని చాటి చెప్పేలా 17 రకాల కళారూపాలు ప్రదర్శించారు. వేడుకలు జరుగుతున్న సమయంలో వర్షం పడటంతో సాంస్కృతిక కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడినప్పటికీ, 5 వేల మంది ట్రైనీ పోలీసులతో పరేడ్?తో పాటు కళాకారుల కార్నివాల్ సాగింది. వర్షంలోనూ ఘట విన్యాసం, ఒగ్గుడోలు, బోనాల కోలాటం, గుస్సాడీ, బతుకమ్మ తదితర కళారూపాల ప్రదర్శన ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. అనంతరం వేదికపై తెలంగాణకు నృత్య నీరాజనం పేరుతో సంప్రదాయ, పేరిణి భేరిణి శివతాండవం తదితర నృత్య రూపాలు అందరినీ ఎంతగానో ఆకర్షించాయి. కళారూపాల ప్రదర్శన అనంతరం పూర్తి నిడివి కలిగిన "జయ జయహే తెలంగాణ" రాష్ట్ర గీతాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం గీత రచయిత అందె శ్రీ, స్వరకర్త కీరవాణిని సీఎం సన్మానించారు.

# తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

ఇబ్రహీంపట్నం జూన్ 02 (ప్రజామంటలు):



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పదో వార్షిక ఆవిర్భావ వేడుకలు మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జై తెలంగాణ నినాదాలు చేస్తూ అమరవీరుల త్యాగాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుదిగం గంగాధర్, వేల్మూల సుగుణాకర్ రావు, శ్రీనివాస్ రావు, వెంకట్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బాస శ్రావణ్,శేఖర్ రెడ్డి, బండి రాజేష్, కనక జగన్, రాకేష్ రెడ్డి, కంతి ప్రమోద్, రాజశేఖర్ యాదవ్, భాస్కర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

జమ్మికుంట జూన్ 02 (ప్రజామంటలు):



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ని పురస్కరించుకొని ఆదివారం జమ్మికుంట గాంధీ చౌక్ నందు కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు సుంకర రమేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు.రాష్ట్రాన్ని ప్రకటించిన తల్లి సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి, గూడపు సారంగపాణి, సర్దార్, సలీం, సాయిని రవి, కౌన్సిలర్ రాము, దేశిని శ్రీనివాస్, పూదరి రేణుక శివకుమార్ గౌడ్, ముద్దమల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరుల కు ఘనమైన నివాళి

జమ్మికుంట జూన్ 02 (ప్రజామంటలు):



జమ్మికుంట పట్టణంలో అమరుల స్తూపం వద్ద తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తెలంగాణ అమరులకు ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమ్మికుంట జడ్పిటిసి డా. శ్రీరామ్ శ్యామ్ హాజరై అమరాల స్థూపానికి పూలమాలతో నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జమ్మికుంట జడ్పిటిసి శ్రీరామ్ శ్యామ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 సంవత్సరంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 369 మంది విద్యార్థులు బలిదానాలు కావడం జరిగిందని వారు ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. మరిదశ ఉద్యమంలో దాదాపు 12 వందల విద్యార్థులు యువకులు అమరులయ్యారని వారు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన అమరులందరు వారి ఆత్మ చేకూరాలని వారు నివాళులు అర్పించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం విద్యార్థుల బలిదానాలు యువకుల పోరాటాలతోనే సాధ్యమైందని వారు గుర్తు చేశారు. ఆనాటి సమైక్య ఆంధ్రుల పాలనలో తెలంగాణ రాష్ట్రం అనేక వెనుకబాటు గురిగిందని దాని మూలంగా కవులు ,కళాకారులు, మేధావులు, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతోనే సామాజిక తెలంగాణ తో పాటు ఆర్థికంగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందే తెలంగాణ రావాలని వారు కోరారని దాని మూలంగానే 2014 జూన్ 2 తారీఖున తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని వారు గుర్తు చేశారు. ప్రత్యేకతెలంగాణ రాష్ట్ర సాధనకు నాందికి నీళ్లు, నిధులు ,నియామకాల,అనే నినాదంతో ఉద్యమ నాయకులంతా అనేక కార్యక్రమాలు చేశారని వారు గుర్తు చేశారు.




## తెలంగాణ ఉద్యమకారులను గుర్తించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి కే దక్కుతుంది

జమ్మికుంట జూన్ 02 (ప్రజామంటలు):

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్పగా నిర్వహిస్తున్న తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులకు పంపిన ఆహ్వానం మేరకు హుజురాబాద్ నియోజకవర్గం నుండి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ కీ తరలిన తెలంగాణ ఉద్యమకారులు. తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడు అన్నం ప్రవీణ్ మాట్లాడుతూ బీ ఉద్యమకారులను గుర్తించి ఆరు గ్యారంటీల్లో ఉద్యమకారులకు స్థానం కల్పించి అక్కున చేర్చుకున్న పార్టీ, ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నం ప్రవీణ్ కొనియాడారు. ఉద్యమకారులంతా కాంగ్రెస్ ప్రభుత్వానికీ ఋణపడి ఉంటారని అన్నం తెలిపారు. తెలంగాణ వచ్చాక పదేళ్ళు అమరవీరుల త్యాగఫలం. ఉద్యమకారుల నిర్విరామ కృషి ఫలంగా అదికారం చేపట్టిన కె.సి.ఆర్. పది సంవత్సరాలు ఉద్యమకారులను నిత్యం నిర్లక్ష్యం చేశారని అన్నం ప్రవీణ్ తెలిపారు. కె.సి.ఆర్. నిత్యం నియంత లాగా తన మరియు తన కుటుంబ లాభాపేక్ష తప్ప. తెలంగాణ కుటుంబాన్ని గాలికొదిలేశాడని అన్నం మండిపడ్డారు. ఉద్యమ కాలంలో ఎన్నో అవమానాలు, మరెన్నో అవహేళనలు, ఉద్యమ మంటలను ఆర్పేస్తామంటూ ఉమ్మడి పాలకుల ఆగడాలు, చీకటి జీవితాలు, ఉద్యమకారుల రణనినాదాలు, ఉమ్మడి పాలకులు ఉసిగొలిపిన క్రమంలో పోలీసుల పదఘట్టనలు, లాఠీల స్వైరవిహారం, తుపాకుల తూటాల మోత, లాఠీల దెబ్బలకు గాయపడిన అనేక మంది ఉద్యమకారులు, అక్రమ కేసులతో జైళ్ళల్లో మగ్గినం, అయినా వెనక్కి తగ్గకుండా ఉద్యమాన్ని ఉధృతం చేశాం, ఉమ్మడి పాలకుల అహంకారాన్ని ఎండగడుతూ ఊరువాడ ఏకమయ్యాయి, సీమాంధ్ర పెట్టుబడి పెత్తందార్ల కుట్రలను తిప్పికొడుతూ డిల్లీ పీఠాన్నే వణికించిన తెలంగాణ పౌరుషం మనదని అన్నం ప్రవీణ్ కొనియాడారు. ఇలా మహత్తరమైన తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో ఎన్నో చారిత్రక ఘట్టాలు, మరెన్నో చారిత్రిక దృశ్యాలు జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సజీవ సాక్ష్యాలు, సామూహికంగా ప్రతిధ్వనించిన "జై తెలంగాణ" నినాదం ఓ అద్భుతమైన ప్రజాస్వామిక ఆకాంక్షను ఫలవంతం చేసింది., అణగారిన గుండెల్లో గూడుకట్టిన విషాదం ప్రజా ఉద్యమంగా మారి, ప్రజల నాయకత్వంలో ఉద్యమ ఖడ్గంగా మారి, బానిస సంకెళ్ళను తెంచుకున్న రోజు "జూన్ 2" అని అన్నం ప్రవీణ్ ఉద్యమ చరిత్రను గుర్తు చేశారు.

## యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కు సన్మానం మడిపల్లి గ్రామ యూత్ కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట జూన్ 02 (ప్రజామంటలు):



హుజురాబాదు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నూతనంగా నియామకమైన జమ్మికుంటకు చెందిన మహమ్మద్ సజ్జద్ అలీ ని ఆదివారం మడిపెల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా శాలువా తో సన్మానించారు ఈ కార్యక్రమంలో నాయకులు దేశిని కోటి, వల్లాల రాజేష్, రామిడి భగవాన్ రెడ్డి, ఫయాజ్, తాళ్ల పెల్లి అంజి గౌడ్, రామిడి సూర్యతేజా రెడ్డి పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



జగిత్యాల జూన్ 02 (ప్రజామంటలు):

జూన్ 2 ఆదివారం ఉదయం 8 గంటలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ దివాకర టిఎస్ అడిషనల్ కలెక్టర్ మరియు పర్సన్ ఇంచార్జ్ జిల్లా గ్రంథాలయ సంస్థ జగిత్యాల జాతీయ పతాక ఆవిష్కరణ చేసినారు. అధిక సంఖ్యలో పాఠకులు వివిధ పోటీ పరీక్షలకు గ్రూప్ వన్ మరియు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థిని విద్యార్థులు మరియు గ్రంథాల య సిబ్బంది పాల్గొన్నారు.

## జెడ్పి కార్యాలయంలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు

జగిత్యాల జూన్ 02 (ప్రజామంటలు):



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... అరవై ఏళ్ల గోసకు, సబ్బండ వర్గాలు కొట్లాడి, పోట్లాడి మా రాష్ట్రం మాకంటూ... అమరుల త్యాగాలకు ఫలితం రోజు నేడు. ఉక్కు సంకల్పం, బక్కపలచని కెసిఆర్ పోరాట ఫలితం నేటి తెలంగాణ రాష్ట్రం. తెలంగాణ ఆచరిస్తుంది..దేశం అనుసరిస్తుంధనేలా...తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి,సంక్షేమంలో అనతి కాలంలోనే అగ్రస్థానానికి చేర్చిన ఘనత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కె దక్కుతుందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి ,స్ఫూర్తి అదే సంకల్పం ఇకముందు ఉండాలని తెలంగాణ దేశానికి రోల్ మోడల్ గా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఒక్కరికీ తెలంగాణ దశాబ్ది ఉత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు,జెడ్పీటీసీలు ప్రశాంతి,పద్మ మహేష్,మనోహర్ రెడ్డి,భూమయ్య,జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు సుభాన్,జెడ్పీ సీఈవో రఘువరణ్, ఈ ఈ పంచాయతీ రాజ్ రెహ్మాన్, డి ఈ మిలింద్ జిల్లా పరిషత్ మరియు పంచాయతీ రాజ్ సిబ్బంది ఉన్నారు.

## తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు, ఘనంగా వేడుకలు

ఎల్కతుర్తి జూన్ 02 (ప్రజామంటలు):



ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర అఖిల, యస్.సి., యస్.టి, బిసి, మైనారిటి అసంఘటిత కార్మిక సమైఖ్య భవన నిర్మాణ సంక్షేమ మండల, ఐక్యవేదిక, మహిళ సంక్షేమ మండల, ఐక్యవేదిక కళాకారుల సంక్షేమ మండల ఐక్యవేదిక, వికలాంగుల సంక్షేమ మండల ఐక్యవేదిక డ్రైవర్స్ సంక్షేమ మండల ఐక్యవేదిక, సర్వసంఘాల సమైఖ్య కేంద్రం ఆధ్వర్యములో తెలంగాణ ఇచ్చిన శ్రీమతి సోనియమ్మ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలంగాణ రాష్ట్రం తెచ్చిన ఉద్యమ బహుజన నాయకులు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలియజేసినారు.

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు హైదారాబాద్ తరలి వెళ్ళిన ఉద్యమకారులు

## సౌకర్యాలు కల్పించిన జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

## ఆనందం వ్యక్తం చేసిన ఉద్యమ నేతలు

జగిత్యాల / సికింద్రాబాద్ జూన్ 02 (ప్రజామంటలు):







రాష్ట్ర రాజధాని హైదారాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జగిత్యాల జిల్లా నుండి ఉద్యమ కారులు, అమరవీరుల కుటుంబీకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సమయ స్ఫూర్తితో స్పందించి జిల్లాలోని ఉద్యమకారులను, అమర వీరుల కుటుంబీకులను గుర్తించి హైదారాబాద్ లో జరిగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు. వారికి తగిన ఏర్పాట్లు, వసతులు కల్పించారు. జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజక వర్గాలకు వేర్వేరుగా బస్సులను, కార్లను, ఏర్పాటు చేసి ప్రభుత్వ ఖర్చులతోనే రవాణా సౌకర్యం కల్పించారు. అదనపు కలెక్టర్ టి.ఎస్.దివాకర, పరిపాలనాధికారి పుప్పాల హన్మంతరావు, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు లు ఎప్పటి కప్పుడు ఏర్పాట్లను, రవాణా విషయాలను సందానకర్తల ద్వారా తెలుసుంకుంటూ ఎలాంటి లోటు - పాట్లు జరుగకుండా తగు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ప్రతి బస్సులో సందాన కర్తలను, సహాయకులను, ఆరోగ్య శాఖ సిబ్బందిని నియమించి సేవలు అందించారు. ఉద్యమ కారులకు, అమరవీరుల కుటుంబాలకు అల్పాహారం, భోజన సౌకర్యాలు, త్రాగు నీటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ ఉద్యమ కారులు సి.హెచ్.వి. ప్రభాకర్ రావు, చుక్క గంగారెడ్డి, సిరిసిల్ల రాజేందర్ శర్మ, కంతి మోహన్ రెడ్డి ల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాలతో పాటు పట్టణాల, గ్రామాల నుండి సుమారు రెండు వందల మందికి పైగా ఉద్యమకారులను, అమర వీరుల కుటుంబీకులను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తరలించారు. కొందరు ఉద్యమకారులు వారంతట వారే ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకొని హైదారాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో జరిగిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తరలి వెళ్లారు. ధర్మపురి లోని తహశీల్దార్ కార్యాలయం నుండి, జగిత్యాల లోని ఆర్డీవో కార్యాలయం నుండి, మెట్ పల్లి ఆర్డీవో కార్యాలయాల నుండి ఆదివారం ఉదయత్ పూర్వం 3-00 గంటలకు వాహనాల్లో ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబీకులు హైదారాబాద్ తరలి వెళ్లారు.

**ఆనందం వ్యక్తం చేసిన ఉద్యమ నేతలు**

ఆరు దశాబ్దాల పాటు జరిగిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం అనంతరం ఏర్పడ్డ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పదేండ్ల పాలన తర్వాత నూతన ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఆహ్వానం రావడం ఆనందంగా ఉందని ఉద్యమ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమ కారులను గుర్తించి వేడుకలకు ఆహ్వానం పలికిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి వర్గానికి, ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా కు, అదనపు కలెక్టర్ టి.ఎస్.దివాకర కు, ఇతర అధికారులకు, సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమ కారులకు ఇచ్చిన ఇదే గుర్తింపును ఎప్పటికీ కొనసాగించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉద్యమ ఆకాంక్షలను, అమరవీరుల ఆశయాలను నెరవేర్చాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, ధర్మపురి, జగిత్యాల నియోజక వర్గాల తో పాటు వివిధ మండలాల నుండి, పట్టణాల నుండి సుమారు 200 మందికి పైగా ఉద్యమ కారులు, అమరవీరుల కుటుంబీకులు హైదారాబాద్ తరలి వెళ్లినట్లు వారు వివరించారు.

# జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు ,సిబ్బందికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

## జిల్లా ఎస్పీ శ్రీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్

జగిత్యాల జూన్ 02 (ప్రజామంటలు):



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ను పురస్కరించుకొని జిల్లా ఎస్పీ జాతీయ జండా ను ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శాంతియుత వాతావరణం ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు.సంఘ విద్రోహుల పట్ల కఠినంగా ఉంటూ, సాధారణ ప్రజలలో భరోసా కల్పిస్తూ స్నేహపూర్వక పోలీసుగా చేస్తూ ఎలాంటి వివక్ష లేకుండా ప్రజలందరికీ ఒకే రకమైన సేవలు అందిస్తున్నామని అన్నారు. అధికారులు మరియు సిబ్బంది మరింత బాధ్యతతో పని చేసి జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవల ను బాధ్యతతో అందిస్తూ పోలీసుశాఖకు మంచి పేరు తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వినోద్ కుమార్,డీఎస్పీ రవీంద్ర కుమార్, ఆర్ఐ లు జానీమియా, రామకృష్ణ పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




ఇబ్రహీంట్నం జూన్ 02 (ప్రజామంటలు):

ఇబ్రహీంపట్నం మండలం లోని ప్రభుత్వ కార్యాలయాలలో మరియు గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఇన్చార్జిగా విధులు నిర్వహిస్తున్న అధికారులు, గ్రామ కార్యదర్శులు, అంగన్వాడి టీచర్స్, ఆశ వర్కర్స్, బిఎల్వోలు, రాజకీయ నాయకులు, ప్రజలు, ఘనంగా తెలంగాణ దశాబ్ది వేడుకలు జరుపుకున్నారు.

# దశాబ్ది వేడుకలకు హాజరైన తెలంగాణ ఉద్యమకారులు




భీమదేవరపల్లి జూన్ 02 (ప్రజామంటలు):

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో పాల్గొనేందుకు భీమదేవరపల్లి మండల జేఏసీ నాయకులు తరలి వెళ్లారు. సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు హాజరయ్యారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెఎసి చైర్మన్ డ్యాగల సారయ్య, అశోక్ ముఖర్జీ, కో.ఆర్డినేటర్ కాశిరెడ్డి ఆదిరెడ్డి, చెప్యాల ప్రకాష్, ముల్కనూరు ఎంపిటిసి బొల్లంపల్లి రమేష్, సిపిఐ నాయకులు ఆదరి శ్రీనివాస్, కొంగల రామచంద్రారెడ్డి, గొడుగు వజ్రమ్మ, గాండ్ల పద్మ, మైలగాని జయ, రాగం రమేష్, వేణు, ఉమామహేశ్వర్, అల్లం సతీష్, ఉప్పుల కుమార్, కండె రమేష్, సుధాకర్, సంజీవ్, అంబాల చక్రపాణి, నాగిరెడ్డి, బేరే యాదగిరి, కూన బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# ఏకాదశీ ఉత్సవం మరియు వరుణయాగం

కరీంనగర్ జూన్ 02 (ప్రజామంటలు):



స్థానిక తిరుమల్ నగర్ లోని మయూరిపీఠం శ్రీ నిలయంలో అత్యంత వైభవంగా వైశాఖ బహుళ ఏకాదశి ఉత్సవం మరియు వరుణ యాగం జరిగింది.. మయూరగిరి పీఠాధిపతులు జ్యోతిష్య వాస్తు పండితులు నమిలకొండ రమణాచారి స్వామి వారి ఆధ్వర్యంలో ఉదయం నుండి పూజలు నిర్వహించి విష్ణుమూర్తికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అనంతరం హెూమాలు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణాలు మరియు ఎండలు విపరీతంగా ఉన్నందున వరుణ మంత్ర జపాలు వరుణ హెూమాలు కూడా నిర్వహించారు. ఈ హెూమం ద్వారా కనీసం ఎండ తీవ్రత తగ్గి చల్లటి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంటుందని రమణాచార్యులు తెలియపరచారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాచార్యులు వివేకాచార్యులు రమేష్ స్వామి మొదలగు పండితులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

భీమదేవరపల్లి జూన్ 02 (ప్రజామంటలు):



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మరియు మార్కెటింగ్ సొసైటీ ఆవరణలో సంఘ అధ్యక్షులు అల్గి రెడ్డి ప్రవీణ్ రెడ్డి జాతీయ జెండాను, సొసైటీ జనరల్ మేనేజర్ మార్పాటి రాంరెడ్డి సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు, కార్య వర్గసభ్యులు, సంఘ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్న శ్రీనివాస్

భీమదేవరపల్లి జూన్ 02 (ప్రజామంటలు) :

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జూనియర్ లైన్మెన్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ సిఎండి చేతుల మీదుగా బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వేడుకల సందర్భంగా విద్యుత్ రంగంలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అవార్డులు ప్రధానం చేశారు. ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న శ్రీనివాస్ ను అధికారులు, తోటి ఉద్యోగులు అభినందించారు.

# దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న కోరుట్ల ప్రాంత తెలంగాణ ఉద్యమకారులు



**మెట్ పల్లి జూన్ 02 (ప్రజామంటలు):**

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్ లోని పెరేడ్ గ్రౌండ్స్ లో ఆదివారం జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో కోరుట్ల ప్రాంతానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు. ఉద్యమ కారుల్ని గత బీఆరెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న కారణంతో తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం వారిని గుర్తించి గౌరవించాలన్న ఉద్దేశ్యంతో వారందరికి తాజా దశాబ్ది వేడుకల్లో పాల్గొనేలా ప్రత్యేక ఆహ్వానాలు పంపించింది. ప్రభుత్వ అధికారిక ఆహ్వానం మేరకు కోరుట్ల నియోజకవర్గం నుండి కంతి మోహన్ రెడ్డి, సౌడాల కమలాకర్, కోటగిరి వెంకటస్వామి, తొగిటి అంజయ్య, తులసి ఆగమయ్య, కోటగిరి గంగా శ్రీనివాస్, రేండ్ల రమేష్, లక్కంపల్లి అరుణోదయ కుమార్, కస్తూరి భూమేశ్వర్, నాగుల రమేష్, గుమ్మడి లక్ష్మీ నర్సయ్య, చింతకుంట శంకర్, వన్నెల శశి కుమార్, ఎలుక కమలాకర్, దోస గణేష్, మ్యాన సతీష్, కనక మహేష్, జిల్లపల్లి దిలీప్, రెబ్బటి మల్లయ్య యాదవ్, ఎర్రం నర్సయ్య, కుక్కదువ్వ నర్సయ్య, కాట దశరథం, వన్నెల శంకర్, రెడ్డబోయిన రాజేశ్వర్, మాలవతు బిక్య నాయక్, మాలవతు రమేష్ నాయక్, లావుడ్యా మధు నాయక్, భూక్య ప్రతాప్, గంగవేని మల్లేష్, మారంపల్లి భూమన్న, యండి. రిజ్వాన్, నర్సయ్య, అశోక్, శ్రీనివాస్, లింగారెడ్డి, రాహుల్, రవి, భూమేశ్వర్, నర్సయ్య, నాగరాజు తదితరులు హైదరాబాద్ వెళ్లినవారిలో ఉన్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మహాదేవపూర్ జూన్ 02 (ప్రజామంటలు):

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహాదేవపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్ ఆధ్వర్యంలో జాతీయ జెండా నుఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాపు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎర్రవెల్లి విలాస్ రావ్, పాక్స్ చైర్మన్ మాజీ జెడ్పీటీసీ సభ్యులు చల్ల తిరుపతి రెడ్డి,ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్,పార్టీ ఉపాధ్యక్షులు కోట సమ్మయ్య,మండల ప్రధాన కార్యదర్శి అయిత తిరుపతి రెడ్డి,కాళేశ్వర దేవస్థాన డైరెక్టర్ పద్మ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వామన్ రావు కూరతోట కృష్ణమూర్తి సమ్మయ్య గడ్డం స్వామి మల్లయ్య ప్రదీప్ గట్టయ్య ధర్మయ్య బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వెంకటరమణ రమేష్ శేఖర్ ఎనక పెల్లి మాజీ సర్పంచ్ రవిచందర్, ఉస్మాన్ గణేస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

## తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు

## జిల్లా అధికారి ఆర్. శ్రీనివాస్ రావు

భీమదేవరపల్లి జూన్ 02 (ప్రజామంటలు):




ఆయిల్ ఫామ్ సాగుకు కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు వివిధ రకాల సబ్సిడీలను అందిస్తున్న దృష్ట్యా హనుమకొండ జిల్లా హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ ఆఫీసర్ ఆర్.శ్రీనివాసరావు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లితో పాటు, ఎల్కతుర్తి మండలం బావుపేట వద్ద ఆయిల్ ఫామ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం ఉండడం వల్ల ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆయిల్ ఫామ్ తోటలను ప్రోత్సహిస్తున్నదని అన్నారు. రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కంపెనీ (కే.ఎన్ బయో సైన్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండి పి.సుధా రెడ్డి, కుశాల్ రెడ్డి) ల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం ఫ్యాక్టరీ జోన్ లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులను ఆయిల్ ఫామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ బి. మానస, కంపెనీ ప్రతినిధులు ఆయిల్ ఫామ్ జిల్లా కోఆర్డినేటర్ కే. రంజిత్, హేమంత్ కుమార్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.




**కథల రచయితలకు ఆహ్వానం**

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

# గ్లోబల్ విలేజ్



అనగనగా ఒక సముద్రం. ఆ సముద్రంలో అనేక జలచారలున్నాయి. చేపలు, కప్పలు, ఆక్టోపస్ లు, తాబేళ్ళు, మొసళ్ళు, తిమింగలాలు, షార్కులు నత్తలు, పీతలు, రొయ్యలు ఒకటేమిటి రకరకాల జీవులు నివసిస్తూ ఉన్నాయి. అన్నీ ఎంతో ప్రేమగా ఒకదానినొకటి పలకరించుకుంటూ కలుసుకుంటూ ఉంటాయి. చాలా సంతోషంగా తమ జీవనాన్ని కొనసాగిస్తూ ఉన్నాయి.

సముద్రంలో చేపలు పట్టడానికి వేటగాళ్ళు వలలతో వస్తుంటారు. ఆ వలల నుండి జంతువులన్నీ తప్పించుకోవడానికి ప్రయత్నం చేస్తుంటాయి. కానీ, తెలియకుండానే చాలాసార్లు వలలో చిక్కిపోతుంటాయి. మానవులకు ఆహారంగా మారిపోతుంటాయి. తల్లి దండ్రులు వేటగాళ్ళ గురించి ఎన్నో జాగ్రత్తలు చెప్తుంటాయి. పిల్లలు పుట్టగానే ఈతను నేర్పుతుంటాయి. ఆహారాన్ని అన్వేషించడం, వేటాడి తెచ్చుకోవడం వంటి జీవన నైపుణ్యాలను పెద్దలు పిల్లలకు నేర్పుతూ ఉంటారు. ఆ సముద్రంలో ఒకప్పుడు సాధార ణంగా జరిగే విషయాలివి. కొత్తగా నవ నాగరికత ప్రవేశించాక ప్రతివారి జీవితాల్లోనూ కొత్త దనం చోటు చేసుకున్నది.

మానవ వికాసంలోని నాగరికత జంతువుల్లోకి కూడా చేరింది. అక్కడకూడా స్కూళ్ళు వెలిశాయి. సహజంగా నేర్చుకునే ఈత ఆహార అన్వేషణ కాకుండా చదువులు కూడా వచ్చి చేరాయి. ఒకవేళ వేరే సముద్రాలలోనికి వెళ్ళవలసి వస్తే ఎలా బతకాలి ట్రెయి నింగ్ స్కూళ్ళు మొదలయ్యాయి. ఒకవేళ సముద్రాలు ఇంకిపోతే నేల మీద బతకటానికి కావాల్సిన స్కిల్స్ కూడా నేర్పిస్తారట. ఇలా గ్లోబల్ విలేజ్ పేరుతో ప్రపంచమంతా సుగ్రామంగా మారాలని యువత యోచిస్తున్నది.

పిల్లలందరినీ స్కూళ్ళలో చేర్చారు. చేపలు, రొయ్యలు, నత్తలు, ఆక్టోపస్, సీహార్స్ ల పిల్లలన్నీ స్కూళ్ళలో చేరాయి. రోజూ కొత్త కొత్త విషయాలన్నీ నేర్పుతున్నారు. గంటకు పది కిలో మీటర్ల వేగంతో ఈదులాడే చేపల్ని గంటకు 50కిలో మీటర్ల వేగంతో ఈదమని చెపుతున్నారు. ఆక్టోపస్ పిల్లలకు ఎనిమిది చేతులతోనూ హెూం వర్కులు చేయమని స్కూల్లో టీచర్లు చెప్పారు. నత్తల పిల్లలకు చాలా స్పీడుగా నడవాలని ట్రెయినింగ్ ఇస్తున్నారు. తాబేళ్ళ పిల్లలకు భయపడకుండా తల బయటనే ఉంచు కోవాలని ఆదేశిస్తున్నారు. ఏదైనా ప్రమాదం ఎదురైనపుడు పోరాడాలి గానీ తలను డిప్ప లోపలికి దూర్చకుంటే ఎలాగా అని అడుగుతున్నారు. సీహార్స్ పిల్లలతో ఇలా చెప్పారు. మీ పేరులో గుర్రం అని ఉన్నది. అంటే మీరు పరుగేత్తగలరు అన్నమాట. అదిమామూలు గుర్రల్లాగా నేల మీద పరుగెత్తడం నేర్చుకోండి. కప్పల పిల్లలను ఇలా ఆదేశించారు"మీరు ఎలాగూ నేల మీద కూడా నడవగలరు కానీ మీ కప్పలన్నీ గెంతుకుంటూ నడిచే వరకూ చాలా సమయం వృధా అవుతున్నది. కాబట్టి వేగంగా నడవడం, పరుగెత్తడం నేర్చుకోక పోతే ఆధునిక కాలంలో మనలేరు.

అలాగే మొసలి పిల్లలకు కూడా చెప్పారు. "మీ అమ్మా నాన్న పూర్వకాలంలో పాక్కుంటూ నడిచేవారు. కానీ ఈ స్పీడు యుగంలో అలా కుదరదు. అందుకే మీరు సైకిల్ తొక్కడం నేర్చుకుంటే బాగుంటుంది. సైకిల్ కొనుక్కోండి. ప్రతి రోజు ఉదయాన్నే ప్రాక్టిసు మొదలెట్టండి. ఈ సైక్లింగ్ వలన మీ భారి ఆకారాలు తగ్గిపోయి జీరో సైజుకు వస్తాయి. అందరూ తమ ఆకారాన్ని బరువును ఫ్యాటునూ తగ్గించుకుంటున్నారు".

సముద్రంలో చదువుల మానియా మొదలయింది. పిల్లలు ఈ పనులన్నీ చేయలేక ఆపసోపాలు పడుతున్నారు. తల్లిదండ్రులకు పెద్ద శిక్షగా మారింది. ఉదయాన్నే ఆహార అన్వేషణకు వెళ్ళే తల్లిదండ్రులు పిల్లల వెంట పరుగులు తీయటం సరిపోతున్నది. ఎప్పుడూ లేని ఈ కొత్త కష్టం ఏమిటో అర్థం కాలేదు. ఈ కొత్త ప్రపంచం ఏమిటో తెలియ లేదు. గ్లోబల్ విలేజ్ సూత్రం అర్థం కాలేదు.

ఇలాగే కొన్ని రోజులు గడిచేయి. బంగాళాఖాతంలో జీవించే ఈ పిల్లలందరికీ ఫసిఫిక్ సముద్రంలో ఎలా జీవించాలో నేర్పిస్తున్నారు. అది చాలా లోతైన సముద్రమట. అక్కడ ఎలా ఈదాలో ట్రెయినింగ్ ఇస్తున్నారు. పిల్లలు అలసిపోయాయి. తల్లిదండ్రులకు ఆహారం సరిగా అందక నీరసించి పోయాయి.

అందరూ ఒకచోట కూర్చుని మాట్లాడుకున్నారు. ఈ చదువుల పేరుతో దోపిడీ తప్ప ఏమీ ఒరగలేదని అర్థం చేసుకున్నాయి. హాయిగా బంగాళాఖాతంలో జీవించే వాటిని పసిఫిక్ సముద్ర పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దటం నచ్చలేదు. పిల్లలందరికీ టేన్షన్లు వచ్చాయి. రోగాల బారిన పడ్డాయి. అంతకు ముందు ఆనందంగా జీవించిన జీవులన్నీ నరకయాతన పడటం మొదలెట్టాయి. అయినా వాటి వలన కలిగే ఉపయోగ మేమిటో అర్థం కాలేదు.

అందరూ నీరసించిపోయి ఒక నిర్ణయం తీసుకున్నారు. ఈ గ్లోబల్ విలేజ్ వద్దని అనుకున్నారు. పిల్లలకు ఈ చదువులు వద్దు. అమెరికా డాలర్లు వద్దని నిర్ణయించారు. టేన్షన్లు, రోగాలు లేని పిల్లలు స్వేచ్ఛగా ఉండాలని అనుకున్నారు. ముందుగా స్కూలు పెట్టిన వాళ్ళని వెళ్ళగొట్టారు. అప్పటి నుంచి వారి జీవితాల్లో వెలుగు వచ్చి చేరింది.

సముద్ర జీవులన్నీ ఊపిరి పిల్చుకున్నాయి. ఎవరి స్థానాల్లో వారు ఆనందంగా జీవించ సాగారు.

డా.. కందేపి రాణీప్రసాద్

## కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

కరీంనగర్ జూన్ 02 (ప్రజామంటలు):



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంతో పాటు నగరంలో పలుచోట్ల ఘనంగా నిర్వహించబడ్డాయి. డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ గారు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాలాపన గావించినారు. అనంతరం కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పురుమల్ల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి గారితో పాటు పలువురు నాయకులతో కలిసి సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 1969 నాటి నుండి తెలంగాణ తొలి దశ మలిదశ ఉద్యమంలో పాల్గొని తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం సంతోషకరంగా భావిస్తున్నామని అన్నారు. అనంతరం నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మజ్జిగ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమాలలో నాయకులు ఎండి తాజ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, చెర్ల పద్మ,పులి ఆంజనేయులు గౌడ్, రహమత్ హుస్సేన్, బానోతు శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, ముస్తాక్ అహ్మద్, ఎస్ ఏ మోసిన్, మాచర్ల ప్రసాద్, ఆకారపు భాస్కర్ రెడ్డి, మల్లికార్జున రాజేందర్, గంట కళ్యాణి శ్రీనివాస్, భూమా గౌడ్, బొబ్బిలి విక్టర్, వెన్న రాజమల్లయ్య, కల్వల రామచందర్ , ముల్కల ప్రవీణ్ ,కొత్తకొండ శంకర్, కర్ర రాజశేఖర్, మామిడి అనిల్ కుమార్, కాడి శంకర్, జి డి రమేష్, దీకొండ శేఖర్, పడిశెట్టి భూమయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ఆసిఫ్, స్వప్న శ్రీ, వంగల విద్యాసాగర్, కుంభాల రాజు కుమార్, నాగుల సతీష్, వెన్నం రజిత, కరీం, పర్వత మల్లేశం, హసీనా, రాచర్ల పద్మ, ఆస్తాపురం తిరుమల, మాదాసు శ్రీనివాస్, నెల్లి నరేష్, పోరండ్ల రమేష్, బత్తిని చంద్రయ్య గౌడ్ ,శ్రీరాముల రమేష్, షబానా మహమ్మద్, గొర్రె శివ, సిరికొండ శివప్రసాద్, రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కోటి రతనాల వీణ

ఎల్కతుర్తి జూన్ 02 (ప్రజామంటలు):



సబ్బండ వర్గాలు కొట్లాడి సాధించిన నా తెలంగాణ కోటి రతనాల వీణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించి పురుడు పోసుకొన్న తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు ఈరోజు భారతీయ జనతా పార్టీ జిడబ్ల్యూఎంసి 56వ డివిజన్ అధ్యక్షులు మందోటి మహేందర్ పటేల్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జండా ఆవిష్కరించిన డివిజన్ అధ్యక్షులు మందోటి మహేందర్ పటేల్ ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు లీగల శివరాం కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి తక్కల్లపల్లి అమృత రావు, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి కటకం రాజేష్, డివిజన్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి లక్ష్మణరావు, కోటగిరి నరేందర్, ముల్కనూరు చంద్రమౌళి, తాడెం రాజేందర్, బొద్దిరెడ్డి సురేందర్ రెడ్డి, పేరాల కుమార్ స్వామి, చెరుకుపల్లి యోగేశ్వర్, కిసాన్ మోర్చా కార్యదర్శి మాచర్ల రామచందర్, సతీష్ వెంకట్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన త్యాగవీరులకు పాలాభిషేకం చేసిన - సామజిక కార్యకర్త పిడిశెట్టి రాజు

కోహెడ జూన్ 02 (ప్రజామంటలు):



(సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ భార్గవాపురం నియోజకవర్గం/కోహెడ మండలం) నాలుగు కోట్ల తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష ను నెరవేరవేర్చిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు (ఏ.ఐ.సి.సి) సోనియా గాంధీ, తెలంగాణ రాష్ట్ర సాధనయే దెయ్యంగా ప్రజలను ఏక తాటిపై ఉద్యమం నడిపించిన వీరుడు మాజీ సీఎం కేసీఆర్, తెలంగాణ బిల్లు ఆమోదం కోసం పోరాడిన గొప్ప వీర వనిత తెలంగాణ చిన్నమ్మా దివంగత సుష్మస్వారాజ్ చిత్రపటాలకి ఈరోజు తెలంగాణ రాష్ట్ర పదవ ఆవిర్భావ దినోత్సవం సందర్బంగా ప్రముఖ సామజిక కార్యకర్త పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధికి సీఎం ఏనుముల రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలు, కృషి చాలా గొప్పవి అన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నీతి నిజాయితీగా పనిచేసి గొప్ప ప్రజాప్రతినిధులుగా పేరు ప్రాఖ్యాతలు పొందాలని ఆకాంక్షిచారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు వరికోలు శ్రీనివాస్, యాదగిరి, వేముల శ్రీనివాస్ నేత, ప్రముఖ వ్యాపార వేత్తలు మనోహర్ , గంగాధర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ లోని తెలంగాణ భవన్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పాల్గొన్న జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్



## ఎన్నో పోరాటాల ఫలితమే తెలంగాణ
## జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల జూన్ 02 (ప్రజామంటలు):

ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణకు పది వసంతాలు పూర్తి చేసుకొని అనతి కాలంలోనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం 6 గ్యారెటీ పథకాల అమలు అద్భుత విజయాలను సాధించుకున్నామని, పథకాల అమలులో జగిత్యాల పట్టణం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని జగిత్యాల మున్సిపల్ చైరపర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి మున్సిపల్ కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ జరిపారు. దేశంలో మరే రాష్ట్రం అమలు చేయని ఎన్నో వినూత్న కార్యక్రమాలకు నాంది పలకడం ద్వారా తెలంగాణ రాష్ట్ర దేశానికి ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. ప్రభుత్వ పాలలను ప్రజలకు మరింత చేరువ చేయుటలో భాగంగా చేపట్టిన జిల్లా పునర్విభజనతో సత్ఫలితాలు అందుతున్నాయన్నారు. కాంగ్రెస్ పథకాల అమలులో జగిత్యాల స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. అద్భుత విజయాలకు శ్రీకారం చుట్టిన రాష్ట్రం కేవలం తెలంగాణ మాత్రమే అని కొనియాడారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్స్, మున్సిపల్ కమిషనర్ అనిల్ బాబు, అధికారులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమంలో మరుపురాని స్మృతులెన్నో
## ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల జూన్ 02 (ప్రజామంటలు):



ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాకారమైన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమ స్మృతులతో జగిత్యాల జిల్లా ప్రయాణం సాగిస్తుందనీ ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లురి లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం లోని అంగడి బజార్ వద్ద కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహంకు ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లురి లక్ష్మణ్, జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంతోపాటు జిల్లా ఏర్పాటులోనూ ప్రజలు పోరాట పటిమను చూపారు. సాధించుకున్న జిల్లా అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్స్ కొలగాని ప్రేమ లత, దాసరి లావణ్య,లలిత తదితులున్నారు.

## ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

గొల్లపల్లి జూన్ 02 (ప్రజామంటలు):



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను గొల్లపల్లి మండలంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి నక్క శంకరయ్య, తహసిల్దార్ జమీర్, ఎంఈఓ జమునా దేవి, ఏఓ బొట్ల కరుణ, ఏపీఎం త్రివేణి, ఎస్సై చిర్ర సతీష్ కుమార్, కార్యదర్శి ఫైజొద్దిన్, సింగిల్ విండో చైర్మన్ డా. సుంకిశాని రాజసుమన్ రావు తో పాటు ఆయా గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు ,ఆయా కార్యాలయాల్లో జెండాలు ఆవిష్కరించి జాతీయ గీతాలను ఆలపించి జెండా వందనం చేశారు .అలాగే గొల్లపెల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిషాంత్ రెడ్డి ఆధ్వర్యంలో, బిఆర్ఎస్ శ్రేణులు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను వేరువేరుగా ఘనంగా జరుపుకున్నారు .అమరులు త్యాగాలను తెలంగాణ ఉద్యమ ఘట్టాలను నెమరు వేసుకున్నారు. తెలంగాణ అమరులకు ఘన నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు సిబ్బంది కార్మిక, మహిళ ,యువజన సంఘాలు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ స్టడీ సర్కిల్ లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

జగిత్యాల జూన్ 02 (ప్రజామంటలు):



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా షెడ్యూల్ కులాల శాఖ ఆధ్వర్యంలో ఎస్సి స్టడీ సర్కిల్ లో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అమరవీరుల స్థూపానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఎస్సీ స్టడీ సర్కిల్ లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగ పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి ఉపయోగపడుతుందని చెప్పారు. రక్తదానం చేసేవారు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఇతరులకు ప్రాణదాతలు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ నరేష్, ఇండియా రెడ్ క్రోస్ సొసైటీ కార్యదర్శి మంచాల కృష్ణ, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చారి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు టీవీ సూర్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.